క్లుప్తంగా

11న సత్రం భూముల కౌలుకు వేలం

కరప: మండలం వేళంగిలోని పాతూరి బుల్లి వెంకయ్యమ్మ సత్రానికి చెందిన భూములు కౌలుకు సాగుచేసుకునేందుకు ఈనెల 11న ఉదయం 9 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్టు గ్రేడ్–1 ఈఓ మోర్త మురళీ వీరభద్రరావు శనివారం తెలిపారు. దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధీనంలోని పాతూరి బుల్లివెంకయ్యమ్మ సత్రానికి సంబంధించిన 21 ప్రతులుగా ఉన్న 55.89 ఎకరాలకు విడివిడిగా (ఒక్కొక్క ప్రతికి) మూడేళ్ల కాలపరిమితికి కౌలుకు సాగుచేసుకునే నిమిత్తం సత్రం ప్రాంగణంలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పాటలో పాల్గొనేవారు రూ.10 వేలు, రూ.3 వేలు, రూ.వెయ్యి వంతున ఆయా ప్రతులకు ప్రధమ ధరావతుగా చెల్లించాలన్నారు. హెచ్చుపాటదారుడు ప్రధమ ధరావత్తు సొమ్ము కాకుండా ఒక సంవత్సరం మగతా సొమ్మును నగదురూపంలో పాటకొట్టి వేసిన వెంటనే చెల్లించాలన్నారు. ఏకారణం చేతనైనా పాట నిలుపుదలకు, వాయిదా వేయడానికి ఈఓకు పూర్తి అధికారం ఉందన్నారు. మిగిలిన వివరాలు సత్రంలోని దేవస్థానం సిబ్బందిని అడిగి తెలుసుకోవాలని ఈఓ మురళీ వీరభద్రరావు సూచించారు.

ప్రపంచ స్నేహితుల దినోత్సవం

బోట్‌క్లబ్: స్థానిక సాయిభార్గవ స్కానింగ్ సెంటర్‌లో ప్రపంచ ఉత్తమ స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ఎందరికో సేవలందించిన వైద్యులను అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్ర చైతన్య సిరాజ్, వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవితకు బలమైన బాల్యం

- ప్రయోజనం చేకూర్చిన అదనపు న్యూట్రిషనల్ ప్రోగ్రాం
- తీవ్ర లోప పోషణ పిల్లలకు వరం
- 381 మందిలో కోలుకున్న 366 మంది బాలలు
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీఎస్‌ఆర్ నిధులతో నిర్వహణ


బాలిక ఇంటికి వెళ్ల అదనపు పోషకాహారాన్ని అందిస్తున్న అంగన్‌వాడీ


తీవ్ర పోషక లోపం ఉన్న బాలిక ఇంటికి వెళ్ల అదనపు పౌష్టికాహారాన్ని అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త, వైద్య ఆరోగ్య సిబ్బంది

కాకినాడ క్రైం: పాడి పంటలు పొంగి పొర్లే.. దారిలో నువ్వు పాటు పడవోయ్.. తిండి కలిగితె కండ కలదోయ్.. కండ కలవాడేను మనిషోయ్.. ఇదీ మహాకవి గురజాడ మనం తీసుకునే నాణ్యమైన ఆహారం గురించి వ్యక్తపరచిన మాటలు. ఆరోగ్యవంతులైన బాలలే తమ బాల్యాన్ని రేపటి బంగారు జీవితం కోసం సంపూర్ణంగా గడపగలరు. మహాకవి మాటలను అక్షర సత్యం చేసేందుకు ఐసీడీఎస్ శ్రమిస్తోంది. జిల్లా పీడీ ప్రవీణ ఆధ్వర్యంలో సీఎస్‌ఆర్ నిధుల సద్వినియోగంతో కాకినాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు అద్భుతాలు చేస్తూ అత్యుత్తమ ఫలితాలు రాబట్టింది.

ఏమిటీ కార్యక్రమం..

ఐసీడీఎస్ పరిధిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం తీవ్ర పోషణలోపం ఉన్న పిల్లల కోసం ఉద్దేశించినది. వారిని పూర్తి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే సొసైటీ లక్ష్యం. ఈ కార్యక్రమానికి అడిషనల్ స్పెషల్ న్యూట్రిషినల్ ప్రోగ్రాం (ఎస్ఎన్‌పీ)గా నామకరణం చేశారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందుకు ప్రత్యేక మెనూ సిద్ధం చేసి అందిస్తున్నారు. దీని కోసం అంగన్వాడీ సిబ్బంది ప్రత్యేక శిక్షణ పొందారు.

ఎలాంటి బాలల కోసం..

ఎస్ఎన్‌పీ పరిధిలోకి వచ్చే బాలలను వయసుకు తగ్గ బరువు లేకపోవడం, ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం, వయసుకు తగ్గ ఎత్తు లేకపోవడం అనే మూడు రకాలుగా విభజించారు. ఆరు నెలల నుంచి ఆరేళ్ల లోపు వయసున్న బాలలకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారిలో తీవ్ర పోషకాహార లోపాన్ని గుర్తిస్తారు.

ఏం చేస్తారు...

అంగన్వాడీ కేంద్రాల్లో సాధారణ పర్యవేక్షణ, పోషణకు అదనంగా ఆహార ప్రణాళికను సిద్ధం చేస్తారు. ఆవు నెయ్యి, బెల్లం, వేరుసెనగ అచ్చును జత చేస్తారు. కేంద్రానికి రాలేనని చెప్పే తల్లులకు నేరుగా వాటిని అందించి ఇంటిలో పోషణ అందేలా చూస్తారు. నెలకి రెండు సార్లు ఎత్తు బరువు కొలుస్తారు. వృద్ధిని నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తారు. అలాగే తల్లులకు పిల్లల పెంపకంపై అవగాహన కల్పిస్తారు. పరిశుభ్రత పాటించడంతో పాటు ఇంటి చుట్టు పారిశుద్ధ్య నిర్వహణ ప్రాముఖ్యాన్ని వివరిస్తారు. అలాగే, కోలుకోవడం కష్టతరమవుతున్న పిల్లలను జీజీహెచ్‌లోని పౌష్టికాహార పోషణ కేంద్రానికి తరలించి ఆహార చికిత్స అందిస్తారు.

366 మందికి సంపూర్ణ ఆరోగ్యం

తీవ్ర పోషకాహార లోప బాలలను ఆరు నెలల క్రితం గతేడాది డిసెంబర్ రెండో తేదీ నాటికి గుర్తించినట్టు సీడీపీవో ఏ.జ్యోతి తెలిపారు. 180 రోజుల ప్రత్యేక ప్రోగ్రాంలో మొత్తం 381 మంది పిల్లలకు గాను 366 మంది కోలుకున్నారని తెలిపారు. కాకినాడ ప్రాజెక్టు పరిధిలో ఉన్న మొత్తం 283 అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

కార్పొరేట్‌ల పెద్ద మనసు

ఈ కార్యక్రమ నిర్వహణకు కార్పొరేట్ సంస్థలు సుమారు రూ.67 లక్షలు సీఎస్సార్ నిధులను వెచ్చించాయి. జిల్లా కలెక్టర్ ఈ నిధులను కార్యక్రమ నిర్వహణకు కేటాయించారు. బాలల్లో ఒకొక్కరికి నెలకి రూ.3,810 మొత్తాన్ని ఖర్చు చేస్తుండగా ఈ వ్యయం కాకినాడ ప్రాజెక్టుకు రూ.95,250 అవుతుంది. ఖర్చుకు తగ్గ ఫలితాన్ని రాబట్టడంలో కాకినాడ ప్రాజెక్టు విజయవంతమైంది.


పోషకాహార నాణ్యతపై తల్లిదండ్రులను ఆరా తీస్తోన్న సీడీపీవో జ్యోతి


బాలుడి ఎత్తు కొలుస్తున్న అంగన్‌వాడీ వర్కర్

సిబ్బంది సహకారంతోనే...



381 మంది పిల్లల్లో 366 మంది ఆరు నెలల వ్యవధిలోనే కోలుకోవడం ఓ ఘనత. పీడీ ప్రవీణ మార్గనిర్దేశం, అంగన్వాడీ వర్కర్లు, ఆయాల సమన్వయం, వారి పనితీరుతోనే ఇది సాధ్యమైంది. మరో 15 మంది దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో కోలుకున్న బాలలను ఎన్ఆర్‌సీలో చేర్చాం. నిత్యం సాగే అంగన్వాడీ సిబ్బంది విధులకు ఈ విధులు అదనం అయినా శ్రమించి చక్కటి ఫలితాలు రాబట్టడంతో సిబ్బంది కృషి ఎంతో ఉంది. జూన్ నెలాఖరు వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. తర్వాత బాలల ఆరోగ్య స్థితిలో వృద్ధిని గుర్తించేందుకు ఉన్నత వర్గాలు ఆడిట్ నిర్వహించనున్నాయి.

– ఎ.జ్యోతి, సీడీపీవో, కాకినాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు

శ్రీవారి పాదాలకు పంచామృతాభిషేకం


భోగి గణపతి పీఠంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

బోట్‌క్లబ్: సముద్ర మట్టానికి పైన 853 మీటర్ల ఎత్తులో వున్న తిరుమల కొండ శ్రేణుల్లోని ఏడు శిఖరాలు ఆది శేషుని ఏడుతలలుగా సూచించే విష్ణు క్షేత్రమని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణ రాజు అన్నారు. స్థానిక దూసర్లపూడి వారి వీధి లోని భోగిగణపతి పీఠం ప్రాంగణంలో శనివారం ఉదయం సుప్రభాత వేళలో శ్రీవారి 35వ జపయజ్ఞ పారాయణ సందర్భంగా తిరుమల శ్రీవారి పాదాలకు పంచామృతాభిషేకం నిర్వహించారు. లోక కల్యాణానికి ధర్మాచరణే శ్రేయస్కరమన్న మహర్షుల ఆధ్యాత్మిక దృక్పథాన్ని ఆచరించాలని కోరారు.

సొసైటీ అధ్యక్ష పదవికి జనార్దనరావు రాజీనామా

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు సహకార పరపతి సంఘం అధ్యక్షుడు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దున్నా జనార్ధనరావు తన పదవికి రాజీనామా చేశారు. శనివారం సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి పాలవడంతో తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 2013లో తనను సొసైటీ అధ్యక్షునిగా రైతులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. అనంతరం వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం త్రీమెన్ కమిటీలో తనకే అవకాశం ఇచ్చిందన్నారు. తాను బాధ్యత తీసుకునే సమయానికి రూ.3.5 కోట్లుగా ఉన్న సొసైటీ టర్నోవర్‌ను ప్రస్తుతం రూ.12 కోట్లకు పెంచినట్లు తెలిపారు. అదేవిధంగా సుమారు రూ.60 లక్షల వ్యయంతో సొసైటీకి ప్రత్యేక భవనాన్ని నిర్మించి ఆదాయం వచ్చేలా చేశామన్నారు. సీ గ్రేడుగా ఉన్న సొసైటీని ఏ గ్రేడు సొసైటీగా మార్చు చేశామన్నారు.

‘చుక్కన’ మృతి తీరని లోటు


సత్యనారాయణరాజు మరణానికి సంతాపం వ్యక్తం చేస్తున్న ఏపీఆర్పీఏ నాయకులు


చుక్కన సత్యనారాయణరాజు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి కాకినాడ జిల్లా గౌరవ అధ్యక్షుడు చుక్కన సత్యనారాయణరాజు అకాల మరణానికి రాష్ట్ర కమిటీ జిల్లా కమిటీలు శనివారం తీవ్ర సంతాపాన్ని దిగ్భ్రాంతిని తెలియజేసింది. ఏపీఆర్పీఏ ఆవిర్భావానికి ఎంతో కృషి చేశారని రాష్ట్ర కమిటీ కోశాధికారి కె.సత్తిరాజు తెలిపారు. దేశ స్థాయిలో ఈపీఎఫ్ పెన్షనర్ల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారన్నారు. అత్యధిక కాలం గిరిజన ప్రాంతంలో ఎక్కువ కాలం పాఠశాలలో పని చేశారు. జిల్లా కార్యదర్శిగా, పెన్షనర్ల సమస్యలపై పోరాటాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. సత్యనారాయణరాజు మరణం పెన్షనర్ల ఉద్యమానికి తీవ్ర లోటన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా పెన్షనర్ల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తామని సత్తిరాజు తెలిపారు. ఆయన మృతికి సంతాపాన్ని తెలియజేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

భట్రాజుల సంక్షేమ సంఘం సంతాపం

బోట్‌క్లబ్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా భట్రాజు సంఘం గౌరవ సలహాదారుగా విశిష్ట సేవలు అందించిన సత్యనారాయణరాజు అకాల మృతి సంఘానికి తీరని లోటని జిల్లా భట్రాజుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు లోలభట్టు శ్రీనివాసరాజు అన్నారు. శనివారం కాకినాడలో చుక్కన సత్యనారాయణరాజు పార్థివ దేహానికి వారు నివాళులర్పించారు. జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్‌కు, యూటీఎఫ్ ఉపాధ్యాయ ఉద్యమనేతగా, విశ్రాంత గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘానికి ఎంతో సేవ చేశారని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు చుక్కన వెంకటరాజు, పరమహంస రాజు, భల్లం రాజు, తదితరులు రాజు మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

దుర్గాడ శివాలయంలో ప్రత్యేక పూజలు



గొల్లప్రోలు: జ్యేష్ఠ మాసంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని దుర్గాడ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

డ్రైనేజీలపై రాళ్లు తొలగించండి

- మేమే తొలగిస్తే చార్జీలు వసూలుచేస్తాం
- వ్యాపారస్తులకు కమిషనర్ సూచన
- కాలువల్లో పూడికతీత పనుల పరిశీలన

కాకినాడ: డ్రైనేజీలలో పూడికతీత పనులకు అవరోధంగా ఉన్న శ్లాబ్‌లను తక్షణమే తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు వ్యాపారులను ఆదేశించారు. తాము తొలగిస్తే అందుకు అయ్యే ఖర్చును వసూలు చేస్తామని స్పష్టం చేశారు. శనివారం ఆయన నగరంలో పూడికతీత పనులను పర్యవేక్షించారు. గాంధీనగర్, చీడీలపోర ప్రాంతాల్లో టీఎంఎక్స్ మెషీన్ ద్వారా జరుగుతున్న పూడికతీత పనులను ఆయన పరిశీలించి అక్కడ ఉన్న సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అలాగే రేచర్లపేట, దుమ్ములపేట, సినిమా రోడ్ ప్రాంతాలలో కార్మికుల ద్వారా జరుగుతున్న పూడికతీత పనులను కూడా ఆయన పర్యవేక్షించారు. పలుచోట్ల పూడిక తీత పనులకు డ్రైనేజీలపై ఉన్న శ్లాబ్‌లను అవరోధంగా ఉన్న అంశాన్ని ఆయన గుర్తించి వాటి తొలగించాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. సకాలంలో పూడికతీత పనులు చేయకపోతే రానున్న వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కాలువలపై శ్లాబుల తొలగింపునకు వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు. వారం రోజుల్లో పూడిక తీత పూర్తి చేయాలని ప్రజారోగ్య విభాగాన్ని ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్తెప్పనాయుడు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.


పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ వెంకటరావు

వైభవంగా మరిడమ్మ తొలి గరగ ఉత్సవం

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి తొలి గరగ ఉత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్.రామ్మోహనరావు, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణలతో తొలి గరగ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ ఏటా ఆషాఢ మాస ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి గరగ ఉత్సవాన్ని నిర్వహించినట్టు తెలిపారు. 15వ తేదీన పందిరి రాట మూహూర్తం, వచ్చే నెల నాలుగో తేదీన జాతర మహోత్సవం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మ ఆశీస్సులు అందుకోవాలని కోరారు.

సాగరజలాలను సంరక్షించాలి


బీచ్‌లో చెత్త తొలగింపును ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ నరసింహ నాయక్

కాకినాడ రూరల్: సముద్ర జలాలు కలుషితం కాకుంటేనే జీవరాశులు బాగుంటాయని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ అన్నారు. ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్, ఓషన్ సొసైటీ ఆఫ్ ఇండియా సహకారంతో సూర్యారావుపేటలోని ఎన్టీఆర్ బీచ్‌లో రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రేడియో అల 90.8 ఎఫ్ఎం, మలిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో పరిశుభ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథి పాల్గొన్న ఆయన విద్యార్థులతో కలసి వ్యర్థాలను తొలగించారు. మరో అతిథి రెడ్‌క్రాస్ కాకినాడ జిల్లా శాఖ చైర్మన్ వైడీ రామారావు, హెల్త్ ఎడ్యుకేషన్, న్యూట్రిషన్ (హెన్) ప్రాజెక్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు డీఎస్ మూర్తి, వైద్యుడు కాద వెంకటరమణ, సామాజిక వేత్త వక్కలంక రామకృష్ణ, ఓషన్ సొసైటీ ఆఫ్ ఇండియా కాకినాడ చాప్టర్ కో ఆర్డినేటరు డాక్టరు ఎస్.శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ సముద్ర జలాల నాణ్యత ఆవశ్యకతను వివరించారు.

మనసులు మురిసె మృగశిరాన

- ఎండలకు అల్లాడిన తనువులకు వానాకాలపు పులకింత
- మాంసాహార ప్రియులకు ఇష్టమైన కాలం



కాకినాడ సిటీ: వేసవి కాలం వచ్చిందంటే భానుడి భగభగలతో ప్రజలు అల్లాడిపోతారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎండల తీవ్రత విపరీతంగా ఉండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. వేసవిలో వచ్చే రోహిణీ కార్తెలో రోళ్లు పగులుతాయని నానుడి. దీని తర్వాత వచ్చే మృగశిర కార్తెకు ఎంతో ప్రాధాన్యం ఉంది. జ్యోతిష శాస్త్రం ప్రకారం మనకు 27 నక్షత్రాలు. సూర్యుడు ఒక్కో నక్షత్రంలో ప్రవేశించడాన్ని బట్టి ఆ నక్షత్రం పేరిట కార్తెలు ఏర్పడతాయి. మృగశిర కార్తెను దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ప్రత్యేకంగా జరుపుకొంటారు. మృగశిర కార్తె అనగానే తొలుత గుర్తుకు వచ్చేది చేపలు ఈ కార్తె ఆరంభం రోజున చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. మృగశిర కార్తెతో వేసవి కాలం దాదాపు ముగిసి వర్షాకాలం మొదలైందని భావిస్తారు.

మనసులను మురిపించే మేఘాలు

విపరీతమైన ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు మృగశిర కార్తె రాకతో వాతావరణం చల్లబడటంతో ఊపిరిపీల్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు వృద్ధి చెందాలని, అన్నదాతల ఇంట సిరులు పండాలని కోరుకుంటూ మృగశిర కార్తె శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నైరుతి రుతుపవనాల ఆగమనం సైతం మొదలై శుక్రవారం, తెల్లవారుజామున జిల్లాలో భారీ వర్షం కురిసింది. వ్యవసాయ ఆధారిత దేశమైన భారతదేశంలో నైరుతి రుతుపవనాల రాకతో వ్యవసాయ పనులు మొదలుపెట్టారు. పంటలు పండటానికి అవసరమైన వర్షాలు కురవడం ప్రారంభమయ్యేది ఈ మృగశిర కార్తెలోనే.

ఆరోగ్య సమస్యలకూ పరిష్కారం

మృగశిర కార్తెలో ఎండల నుంచి ఉపశమనం కలుగుతుంది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడుతుంది. శరీర ఉష్ణోగ్రతల్లో మార్పు వస్తుంది. సాధారణంగా వచ్చే జలుబు, జ్వరం, ఆస్తమా వంటి రోగాలు వ్యాపిస్తాయి. దీంతో మృగశిర కార్తె ప్రారంభంలో కొన్ని ప్రాంతాల్లో బెల్లంలో ఇంగువ కలిపి తింటారు. దీని ద్వారా శరీరంలో ఉష్ణోగ్రతను ప్రేరేపించి వర్షాకాలంలో సోకే వ్యాధులను రాకుండా చేస్తుందని పెద్దలు నమ్ముతారు.

నల్ల నాటు కోళ్లకు డిమాండ్

మృగశిర కార్తె రాకతో వాతావరణంలో మార్పులు రావడం సహజం. మబ్బులు కమ్మే నల్లటి ఆకాశం కనిపిస్తుంది. దీంతో అనాదిగా నల్లటి రంగు మృగశిర కార్తెకు గుర్తుగా నిలుస్తుంది. ఈ కార్తెలో నల్లటి రంగులో ఉన్న కోళ్లు, పొట్టేళ్లు, మేకపోతులకు డిమాండ్. సాధారణంగా లభించే బ్రాయిలర్ చికెన్ ధర రూ.280 నుంచి రూ.300 ఉంది. నాటుకోళ్లకు మరింత డిమాండ్ నెలకొంది. అందులో నల్లరంగులో ఉన్న కోళ్లకు మరింత ఆదరణ పెరిగింది. కార్తె శనివారం ప్రారంభమైనా కొంత మంది మాంసాహారాన్ని తీసుకోకపోవడంతో ఆదివారం తీసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నల్లరంగులో ఉన్న పొట్టేళ్లు, మేకపోతులను ఇప్పటికే పలువురు కొనుగోలు చేసి తీసుకొచ్చారు. ఆరోగ్యపరంగా చెప్పుకుంటే కోడి మాంసం వేడి చేస్తుందని, తద్వారా శరీరంలో ఉష్ణోగ్రత పెరుగుతుందని, సీజనల్‌గా వచ్చే వ్యాధులు రావన్నది అందరికీ తెలిసిందే. ఈ సీజన్‌లో చేపలు తినడం ద్వారా గుండె జబ్బులు, ఆస్తమా రోగులకు ఉపశమనం ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో చేపలను ఇంగువలో, చింతచిగురులో పెట్టి తీసుకుంటారు.

పెరిగిన ధరలు

మృగశిర కార్తె నాడు చేపలకు మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం రెండు, మూడు చేపల ధర అమాంతంగా పెరిగిపోయాయి. చేపల మార్కెట్ల్లో శనివారం బొచ్చులు, బంగారు తీగ, చెరువు చేపలు ధరలు భారీగా పెరిగాయి ఒక్కొక్క చేప సైజును బట్టి రూ.150 నుంచి రూ.300 వరకు ఉండగా పెద్ద చేపలు రూ.400 నుంచి రూ.600 వరకు విక్రయించారు. మృగశిర కార్తె పురస్కరించుకుని చేపల వ్యాపారాలు సైతం ప్రత్యేక ఏర్పాట్లతో విక్రయిస్తున్నారు. కొన్ని చోట్ల ప్రాణంలో ఉన్న చేపలను విక్రయిస్తున్నారు.

సాగుకు సన్నద్ధం

రబీ సీజన్ ముగిసి రెండు నెలలు గడుస్తోంది. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభ కానున్న నేపథ్యంలో మృగశిర కార్తె సందర్భంగా రైతన్నలు వ్యవసాయ పనులు ప్రారంభించడానికి సన్నద్ధం అవుతున్నారు. తొలకరి వర్షాలు కురవగానే దుక్కులు దున్నుతారు.


మృగశిర సందర్భంగా అమ్మకానికి సిద్ధంగా ఉన్న చేపలు


నల్లకోళ్లకు భలే గిరాకీ


వ్యవసాయ పనులు ఆరంభం

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ, గుమ్మళ్లదొడ్డి గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలకు శనివారం భక్తులు పోటెత్తారు. తంటికొండలో వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఉదయం నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే గుమ్మళ్లదొడ్డిలో వల్మీక వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు వేలాదిగా పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి కాలినడకను వచ్చి ప్రదక్షిణలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.